హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌తో ఎన్నో ప్రయోజనాలు..


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో సమావేశమైన మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సమావేశమై ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను గవర్నర్‌కు వివరించారు. లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉందని, అయితే దాని స్థానంలో హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌తో తక్కువ వ్యయంతో ఎక్కువ ఎకరాలకు సాగు నీరు అందించవచ్చునని తాను ఇటీవల జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించిన అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. కొడంగల్ ఎత్తి పోతల పథకానికి రూ.8000 కోట్లు ఖర్చవుతుండగా, హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్ ఆధారంగా కేవలం రూ.150 కోట్లతో వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేయవచ్చునన్నారు. ఈ పథకం ద్వారా ఏటా మూడు పంటలకు నీరు అందించవచ్చన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకంతో ఎకరాకు 6–8 లక్షలు వెచ్చించాలా? లేక వాటర్‌షెడ్ పథకంతో మూడు రెట్లు ప్రయోజనాలు అందిస్తూ ఎకరానికి కేవలం రూ.15,000 మాత్రమే వెచ్చించాలా? అనేది ప్రభుత్వం నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో జహీరాబాద్ సమీపంలోని గొట్టివారిపల్లి గ్రామం, రాజస్థాన్‌లోని 33 జిల్లాల్లో 20 ఏళ్లుగా ఈ పథకాన్ని అమలుచేస్తున్న తీరును, కలుగుతున్న ప్రయోజనాలను గవర్నర్‌కు వివరించారు. కొత్త లిఫ్ట్ స్కీంతో వృథా ఖర్చు అవుతుందని, ఆ నిధులను విద్యారంగ అభివృద్ధికి మళ్లించవచ్చునని అభిప్రాయపడ్డారు. వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం కింద నమోదైన ఫలితాలపై గొట్టివారిపల్లి గ్రామాన్ని సందర్శించాలని ఆయన గవర్నర్‌ను కోరారు. కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ఉన్మాదులపై ఉదాసీనత తగదు


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వం ఉన్మాదులపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తే తెలంగాణ ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన సికింద్రాబాద్ కుమ్మరిగూడల ముత్యాలమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్మాదాన్ని ఏ మతం సహించదని, ఎవరి విశ్వాలకు అనుగుణంగా వారు నడుచుకోవాలని హిందూ మతం సర్వేజన సుఖినోభవంతు అని కోరుకుంటుందన్నారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తి హాస్పిటల్ బెడ్‌పై పడుకుని చాటింగ్ చేస్తూ ఇంకా అవమానకర పోస్టింగ్‌లు పెడుతున్నాడని అల్లానే ఈ పనిచేయిస్తున్నాడని చెప్పుకుంటున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. అతడికి సెల్ ఫోన్ అందించారని ప్రశ్నించారు. అమ్మవారి గుండెల మీద తన్నడమంటే హిందూ మత విశ్వాసం, ధర్మం మీద దాడి చేయడమే అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేందుకు నగరంలో ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా నిఘా విభాగం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓట్ల రాజకీయాలని పక్కనపెట్టాలని సూచించారు. ఉన్మాదులకు కులం, మతం ఉండదని ఇందులో బలి అయ్యేది మాత్రం పేదలేనన్నారు. ఇలాంటి ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని ఆయన హెచ్చరించారు. ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్‌కొంతం దీపిక, బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షురాలు సారిక తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి శాంతి చండీ హోమం

కుమ్మరిగూడ ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం శాంతి చండీ హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యాలో భక్తులు హాజరై సామూహిక సాకను సమర్పించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

22 మందిపై కేసులు నమోదు


చిలకలగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

చిలకలగూడ : చిలకలగూడ ప్రధాన రహదారి, గాంధీచౌక్ ప్రాంతాల్లో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, చిలకలగూడ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో ఆపరేషన్ రోప్ పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా 22 మందిపై కేసులు నమోదు చేశారు. ఏసీపీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ చిలకలగూడ ప్రధాన రహదారి, గాంధీ చౌక్ వద్ద ఫుత్‌పాత్ ఆక్రమణల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తరచూ ట్రాఫిక్ జామ్ కావడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆక్రమణలు తొలగించాలని కోరినప్పటికీ స్పందించకపోవడంతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. చిలకలగూడ నుంచి సీతాఫల్‌మండి, నామాలగుండు, వారాసిగూడ మీదుగా జామై ఉస్మానియా వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందాయని, దశలవారీగా ఆక్రమణలు తొలగిస్తామని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయాన్ని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాసులు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యులు దేవేందర్‌యాదవ్, జగన్‌రెడ్డి, సామ్రాట్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే ఎముకల బలహీనతను గుర్తించాలి..


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

సనత్‌నగర్: ప్రాథమిక దశలోనే చిన్నారుల్లో ఎముకల బలహీనతలను గుర్తిస్తే శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండానే సరిచేయవచ్చునని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్స్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ అన్నారు. పీడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డేను పురస్కరించుకుని శుక్రవారం బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ ఎదుగుతున్న చిన్నారుల్లో హిప్ జాయింట్ సరిగా ఏర్పడకపోవడం, జారిపోవడం, విటమిన్ డీ లోపం వల్ల ఎముకలు బలహీనపడటం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. దీంతో పిల్లలు నీరసంగా ఉండడం, కాళ్లు చేతులు వంకరగా తయారవడం, కండరాల పటుత్వం తగ్గిపోవడం వంటి ఇబ్బందులతో పిల్లలు మెట్లు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా మారుతుందన్నారు. ఇలాంటి ఇబ్బందులతో సతమతమవుతున్న చిన్నారులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందజేస్తే శస్త్ర చికిత్స వరకు వెళ్లకుండా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేయాలని, మొబైల్‌ఫోన్లు, ట్యాబ్‌స్క్రీన్ సమయాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడంతో పాటు సన్‌లైట్‌కు ఎక్స్‌పోజ్ అయ్యేలా దేహ దారుఢ్యానికి క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ప్రతిరోజూ కనీసం గంట పాటు బహిరంగంగా ఆడడం వల్ల పిల్లల్లో ఎముకల అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

విజ్ఞానాన్ని భావి తరాలకు అందించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ సుధాకర్

రాంగోపాల్‌పేట్: ప్రతి వ్యక్తి ఒక విజ్ఞాన భాండాగారమని వారిలోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇఫ్లూ రిటైర్డ్ ప్రొఫెసర్, డీన్ వీ సుధాకర్ అన్నారు. సికింద్రాబాద్ ఎస్డీరోడ్‌లోని సెయింట్ ఆన్స్ బీఈడీ కాలేజీలో రెండు రోజుల సెమినార్‌లో మొదటి రోజు ఆయన కీనోట్ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం, భారతం, పంచతంత్ర తదితరాలను విద్యార్థులకు చిన్నటి నుంచే బోధించాల్సిన బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందన్నారు. వాటిలో మన జీవన విధానంతో పాటు మనిషి ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు, మంచి, చెడులను అర్థమయ్యేలా విద్యార్థులకు వివరిస్తే వారు ఆదర్శంతమైన, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మృణాలిని, కళాశాల ప్రిన్సిపాల్ మేరి కుట్టీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆంథోనియా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చింత తీరేనా..?

- ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుపై ట్రాఫిక్ పోలీసుల నజర్..
- అటు అమీర్‌పేట-పంజగుట్ట ఇటు మాతా టెంపుల్ రహదారుల క్లియరెన్స్..
- ఉపాధి కోల్పోతామని చిరువ్యాపారుల ఆందోళన


అమీర్‌పేట-పంజగుట్ట రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించిన దృశ్యం

సనత్‌నగర్: ఇటు అమీర్‌పేట వై జంక్షన్–పంజగుట్ట మార్గం..అటు కనకదుర్గ దేవాలయం (మాతా టెంపుల్) రోడ్డు..ఈ రెండు మార్గాల్లో ట్రాఫిక్ సమస్య కారణంగా వాహదారులకు నిత్య నరకమే. ఇదుకు రోడ్డు కిరువైపులా విస్తరించిన చిరువ్యాపారాలు ఒక కారణమైతే..ఆయా మార్గాల్లో రాకపోకల తీవ్రత పెరగడం మరో కారణం. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడమే ప్రత్యామ్నాయంగా భావించిన నగర ట్రాఫిక్ పోలీసు విభాగం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్న 'చిరు' అడ్డాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా అమీర్‌పేట–పంజగుట్ట, అమీర్‌పేట–సికింద్రాబాద్ మార్గాల్లో రోడ్లకిరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా ఝుళిపించారు. శుక్రవారం భారీ పోలీసు బందోబస్తుతో రోడ్డును క్లియర్ చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. మొత్తంగా ట్రాఫిక్ క్లియరెన్స్ ఇచ్చినా ఇది ఎన్ని రోజుల వరకు కొనసాగుతుందనేది ప్రశ్నార్థకమే.

వ్యాపారాలకు కేంద్రం అమీర్‌పేట

హైదరాబాద్ నగరానికి నడిబొడ్డున ఉన్న అమీర్‌పేట వ్యాపార, వాణిజ్య, విద్య సంస్థలు తదితర రంగాలకు కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలు అభివృద్ధి చెందకముందే అమీర్‌పేట వ్యాపార, వాణిజ్య సామ్రాజ్యంగా ఎదిగింది. ఈ నేపథ్యంలో వాహన రాకపోకలు నానాటికి పెరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా పెరుగుతూనే వస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య నియంత్రణ అధికారులకు సవాల్‌గా మారింది. సాయంత్రం వేళల్లో వాహనదారులు నరక యాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాల్లో వాహన వేగాన్ని పెంచేందుకు పోలీసులు ట్రాఫిక్ విభాగం వ్యవహరిస్తున్నా ప్రణాళిక రూపొందించారు.ఈ మేరకు నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసుల బృందం స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు ప్రారంభించారు. దీంతో ఇరుగ్గా ఉండే రోడ్లు కాస్తా విశాలంగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు కాస్తా ఊపిరి పీల్చుకుంటున్నారు.


ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

భవిష్యత్తులోనూ కొనసాగేనా..?

స్పెషల్ డ్రైవ్ ద్వారా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినప్పటికీ మళ్లీ యథాస్థితికి రాకుండా ఉంటుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇందుకు గతంలో జరిగిన పరిణామాలే నిదర్శనం. ఇప్పటికే తమ ఉపాధిని దెబ్బతీసేలా ట్రాఫిక్ నరంటూ చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరిస్తారా? లేక స్పెషల్ డ్రైవ్ పేరిట హడావుడి చేసి చేతులెత్తేస్తారా? అన్న సందిగ్ధం నెలకొంది. అదే జరిగితే పరిస్థితి యథారాజా..తథాప్రజా అన్నట్లుగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. చిరువ్యాపారులకు శాశ్వత వేదిక చూపించడం ద్వారా వారు మళ్లీ రోడ్ల మీదకు రాకుండా ఉంటారని భావిస్తున్నారు. అయితే అధికారుల ప్రయోగం ఏ మేరకు విజయవంతం అవుతుందో వేచిచూడాల్సిందే...

మందు బాబులకు జైలు

- డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఎనిమిది మందికి జైలు శిక్ష..
- మరో 18 మందికి జరిమానా..

సనత్‌నగర్: బేగంపేట పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 26 మందిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. వారిలో 18 మందికి రూ.2,100 చొప్పున జరిమానా, రెండోసారి పట్టుబడిన ఐదు మందికి రూ.3,300 చొప్పున జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మొదటిసారి పట్టుబడి ఆల్కాహాల్ పర్సంటేజీ ఎక్కువగా నమోదైన ముగ్గురికి రూ.2,100 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య తెలిపారు. అంతకు ముందు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఆయన కౌన్సెలింగ్ చేశారు.

ఆర్మీ జవాన్ అదృశ్యం

అడ్డగుట్ట: మిలిటరీ హాస్పిటల్‌కు చికిత్స కోసం వెళ్లిన ఆర్మీ జవాన్ అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరి లోని ఎంసీఈఎంఈలో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్ సతీష్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో అధికారులు అదే బెటాలియన్‌కు చెందిన ధర్మరాజ్ సింగ్‌ను అతనికి అటెండెంట్‌గా డిప్యూట్ చేసి చికిత్స నిమిత్తం పూణేలోని మిలిటరీ హాస్పిటల్‌కు పంపించారు. ఈ నెల 5న చికిత్స పూర్తికావడంతో సతీష్‌కుమార్ తన అటెండెంట్ ధర్మరాజ్ సింగ్‌తో కలిసి పూణే నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి బయలుదేరాడు. బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో వాష్‌రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన సతీష్‌కుమార్ తిరిగి రాకపోవడంతో అటెండెంట్ ధర్మరాజ్ సింగ్ అతడి కోసం గాలించాడు. అతడి ఆచూకీ తెలియకపోవడంతో సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోటళ్లపై నిఘా ఉంచాలి


మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

సనత్‌నగర్: హోటళ్లు, లాడ్జీల్లో బసచేసే అనుమానితుల వివరాలను సేకరించి పోలీసులకు సమాచారం అందించాలని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన అమీర్‌పేటలోని వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో ఎస్సార్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఓయో హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ లాడ్జీలు, హోటళ్లలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లకు హోటల్ గదులు అద్దెకు ఇవ్వకూడదన్నారు. మతపరమైన కార్యక్రమాలు నిర్వహించే వారి అనుమతులను పరిశీలించాలని, అలాంటి కార్యక్రమాలపై తమకు సమాచారం అందించాలన్నారు. హోటళ్లు, లాడ్జీల్లో బస చేసే వారి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సార్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, వీరశేఖర్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నియోజకవర్గంలోని 55 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం ఖరీదైన తరుణంలో పేదలకు ప్రభుత్వ పరంగా సహాయాన్ని అందించేందుకు తమ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. శస్త్ర చికిత్సల నిమిత్తం సహాయం అవసరమైన వారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు నేరుగా సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, సుంకు రాంచందర్, లింగాని శ్రీనివాస్, సునీల్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో శుక్రవారం చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో బీజేపీలో చేరేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారన్నారు. నరేంద్రమోదీ, కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మారావు హయాంలో సికింద్రాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనకబడిందని ఆరోపించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 50 వేల సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని త్వరలోనే అధిగమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవుడుకుమార్, ఈఎల్‌ప్రతాప్, సాయి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


ఎస్ఆర్‌నగర్‌లో ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

సనత్‌నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సార్‌నగర్‌లో విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ బాలు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు మారినా విద్యార్థుల తలరాతలు మారడం లేదన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యా రంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల అక్రమ వసూళ్లను అరికడతామని, ఫీజు నియంత్రణ చట్టం అమలుచేసి అధిక ఫీజులకు క్లెం వేస్తామన్న సీఎం..నేడు ఆ విద్యా సంస్థలకే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యూనివర్సిటీలకు ప్రత్యేక రాష్ట్రంలో ఆదరణ కరువైందన్నారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నేతలను ఎస్సార్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నందు, శ్రీరామ్, వంశీ, విజయ్, నరేష్, ఉదయ్, కార్తీక్, మోహన్, పవన్ పాల్గొన్నారు.

అభ్యుదయ డ్వాక్రా కమిటీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు


వివరాలు వెల్లడిస్తున్న అభ్యుదయ డ్వాక్రా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు దేవి దేవకి

రసూల్‌పురా: అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా గ్రూప్ కమిటీ ఆధ్వర్యంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం వారి ఉత్పత్తులను మార్కెట్ చేయడానికి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవి దేవకి తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వివరాలను ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా గ్రూప్‌ల స్టాళ్లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు రూపొందించిన వివిధ ఉత్పత్తులను సైతం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే దేశంలోని 171 ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో కలంకారి, డ్రెస్‌మెటీరియల్, హ్యాండ్లూమ్స్, కిచెన్‌వేర్ ఉత్పత్తులు, కళాఖండాలు, కొండపల్లి బొమ్మలు, నిర్మల్ పెయింటింగ్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్లు. 40 రోజుల పాటు సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పదిగంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. సినీ నటుడు ఆజాద్ బుజ్జిభాయ్ పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవమే ప్రభుత్వ లక్ష్యం


కోట నీలిమ

సనత్‌నగర్: హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కేవలం సుందరీకరణ మాత్రమే కాదని నది పునరుజ్జీవమే లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టు కారణంగా నిరాశ్రయులైన పేదలకు పునరావాసం కోసం సుమారు 15,000 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. అక్టోబర్ 21 నుంచి 24 వరకు మూసీ నది పునరుజ్జీవన ప్రయత్నాలపై అధ్యయనం చేయడానికి ఒక మంత్రి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం దక్షిణ కొరియాలోని సియోల్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, ప్రపంచ స్థాయి స్టేడియాలు, స్కిల్ యూనివర్సిటీ తదితర ప్రధాన ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు ప్రపంచపటంలో స్థానం దక్కబోతుందన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

బన్సీలాల్‌పేట్: పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత కావాలని కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్ సేవా సంఘంలో కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ సహకారంతో జనహిత సేవాట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సకాలంలో ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు పేద వైద్య ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయన్నారు. జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహమూర్తి, వెంకటనారాయణ, కిమ్స్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ విక్రమ్, స్థానిక నాయకులు లక్ష్మీపతి, మోహన్‌రావు, రంగారావు, జగదీష్, శ్రీనివాస్, కుమార్, రాజులతో పాటు మెడికల్ క్యాంపు కో–ఆర్డినేటర్ బి. నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులకు గురికాకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ట్రాఫిక్ పోలీసు అధికారులను కోరారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ దేవాలయం, మైత్రీవనం ప్రాంతాలకు చెందిన ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండ్ల నిర్వాహకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారనే కారణంతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తమకు ఈ చిరు వ్యాపారాలే జీవనాధారమని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా, చిరు వ్యాపారాలకు ఇబ్బందులు కలగకుండా నిర్దిష్టమైన మార్కింగ్ చేయాలని, తద్వారా వ్యాపారులు మార్కింగ్‌కు లోపలే ఉండి వ్యాపారాలు చేసుకుంటారని, దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తవన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చిరువ్యాపారులు శ్రీనివాస్, శివ, సంపత్, అనిల్, రామకృష్ణ, కృష్ణ, రాణికౌర్, బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహ్మా, బలరాం పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయించండి

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాడైపోయి నిరుపయోగంగా ఉన్న పవర్ బోర్లకు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులను చేపట్టాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లింగాని శ్రీనివాస్ ఉన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- రైల్వే ఫ్రంట్‌లైన్ సిబ్బందికి అవగాహన సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: రైలు ప్రమాద ఘటనల్లో సత్వర సేవలు అందజేసే ఫ్రంట్‌లైన్ సిబ్బంది అవగాహన కల్పించేందుకు శుక్రవారం మౌలాలిలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో వర్క్‌షాప్ జరిగింది. అసాధారణ సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు ప్రయాణికులు మరణించడం, గాయపడటం వంటి పరిస్థితుల్లో సిబ్బంది సత్వర సేవలందించేందుకు, ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశంపై ఈ సదస్సులో పలువురు ప్రసంగించారు. సిబ్బంది కోసం సందేశ ఆకృతి అనే మాన్యువల్‌ను విడుదల చేశారు. ద.మ. రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో దాదాపు 250 మంది స్టేషన్ మేనేజర్లు, లోకోపైలెట్లు, రైల్వే మేనేజర్లు పాల్గొన్నారు.

మహిళా భవన్ నిర్మించండి

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల పరిధిలో అడ్డగుట్ట డివిజన్‌లోని ప్రభుత్వ స్థలంలో మహిళా భవన్‌ను నిర్మించాలని రుద్రవీణ మహిళా అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారేడుపల్లి మండల కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మహిళా భవన్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల సమావేశాలకు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాగ్యలక్ష్మి, జమున, మమత, లక్ష్మి, రామలీల తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కారించాలని తెలంగాణ ఆల్ వర్సిటీస్ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తంలను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వృద్ధురాలి అదృశ్యం


లక్ష్మీబాయి (ఫైల్)

సనత్‌నగర్: ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే తులసీరామ్ భార్య లక్ష్మీబాయి (75) మతిస్థిమితం సరిగా లేదు. కొద్ది రోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన లక్ష్మీబాయి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.